W W W.EPAPER.MAHADAILY.COM

మహా పత్రిక

ఖమ్మం

భద్రాద్రి కొత్తగూడెం

10-8-2025



# మధిరకు జలవసంతం!

మధిర నియోజకవర్గం సాగర్ ఆయకట్టు చివరి చివర భూములు పంటలు నీరు కోసం ఆకాశం వైపు ఎదురు చూసే రైతుల హృదయాల్లో ఎన్నో దశాబ్దాలుగా ఒకే కోరిక - "మా పొలాల్లోనూ సాగర్ నీరు రావాలి" అనే కల. ఈ కలను నెరవేర్చడా నికి మరోసారి రైతు బాంధవుడు మల్లు భట్టి విక్రమార్క ముందడుగు వేశారు.

02



05

# ఆదివాసీలు అందరికి ఆదర్శం

## వారికి ప్రపంచ స్థాయిలో ప్రత్యేక స్థానం

## ఆదివాసి దినోత్సవ వేడుకలలో ఎమ్మెల్యే, కలెక్టర్

మహా భద్రాచలం

ఆదివాశీల సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచ స్థాయిలో ప్రత్యేక స్థానం కలిగిఉన్నాయని, ఆదివాశీ లు అందరికి ఆదర్శం అని భద్రాచలం శాసన సభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు, కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. శనివారం ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలను భద్రాచలం ఐ టీ డి ఏ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివాసి సంప్రదాయ నృత్యాలు, వాయిధ్యాలతో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సెంటర్ లోని మన్యం వీరులు ఘంటం దొర, మల్లు దొర, అల్లూరు సీతా రామరాజు విగ్రహాలకు పూల మాలలు వేసి, వారి త్యాగాలను గుర్తుచేసుకున్నారు.

ఎమ్మెల్యే, కలెక్టర్ మాట్లాడుతూ, ఎందరో మహనీయుల త్యాగ ఫలితమే... నేడు ఆదివాసీల సంస్కృతి చిరస్థాయిగా నిలిచి ఉందని అన్నారు. బ్రిటిష్ కాలంలో అటవీ సంపద దోచుకోవడానికి ప్రయత్నించిన వారిని మన మన్యం వీరులు అడ్డుకున్నారని, అందుకే అడవులు సురక్షితంగా ఉన్నాయని అన్నారు.

ఐ టీ డి ఏ ప్రాజెక్ట్ అధికారి రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ మాట్లాడుతూ, గిరిజన అభివృద్ధి కొరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక నిధులు కేటాయి స్తున్నారని, ఐ టీ డి ఏ ల ద్వారా విద్య, ఉపాధి, వ్యవసాయం, గిరిజన గ్రామాలలో మౌళిక వసతులు కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. గిరిజనులకు ఎటువంటి సమస్య ఉన్నా మమ్మల్ని సంప్రదించాలని అన్నారు.



06

## పోరాటాలతోనే హక్కులు సాధించాలి

ఆదివాసీలు తమ హక్కుల పరిరక్షణకై పోరాటాలతోనే సాధ్య పడుతుందని, ప్రభుత్వం పేరుకే గిరిజన చట్టాలని అమలులో మాత్రం శూన్యమని మాజీ శాసన సభ్యులు ,ఆదివాసీ నేత గుమ్మడి నరసయ్య అన్నారు.



03

## ప్రభుత్వ భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్‌లు

## డిప్యూటీ సీఎం భట్టి

**ఖమ్మం, మహా:** సోలార్ విద్యుత్ ను పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని యావత్ క్యాబినెట్ విధాన నిర్ణయం తీసుకుందని రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు అన్నారు.

## సోదర భావంతో మంత్రులకు రాఖీలు

రాఖీ పౌర్ణమి సందర్భంగా జిల్లాలో పండుగ వాతావరణంలో మునిగిపోయాయి. అన్నా-చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా పలు వురు ప్రజా ప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు తమ ఆప్యాయ తను మంత్రులకు రాఖీలు కట్టి వ్యక్తం చేశారు. సత్తుపల్లి పర్యటనలో ఉన్న రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డికి స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి సోదర భావంతో రాఖీ కట్టి శుభాకాంక్షలు అందించారు.



04

## పల్లె రహదారుల అభివృద్ధిపై దృష్టి

- రహదారుల నిర్మాణంతో గ్రామాలను అనుసంధానిస్తున్నాం
- ప్రతి గ్రామానికి పక్కా రహదారుల నిర్మించేదిశగా ప్రణాళిక
- రవాణా సౌకర్యం మెరుగుపడితేనే గ్రామాలు అభివృద్ధి సాధిస్తాయి
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు



08

FOLLOW: @ANNTELUGU
10-8-2025
WWW.EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు

# మధిరకు జలవసంతం!



## మధిర-ఎర్రుపాలెం మండలాలకు సాగర్ జలాల వరం

- జాలిముడి ఆనకట్ట తర్వాత మరో మహత్తర యత్నం
- వైరా నదిపై 630 కోట్ల  లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు భూమిపూజ
- రైతుల చిరకాల కోరిక నెరవేర్చుతున్న ఉప ముఖ్యమంత్రి భట్టి
- మంత్రుల సమక్షంలో  నేడు వంగవీడులో శుభారంభం

మధిర నియోజకవర్గం సాగర్ ఆయకట్టు చివరి చివర భూములు పంటలు నీరుకోసం ఆకాశం వైపు ఎదురు చూసే రైతుల హృదయాల్లో ఎన్నో దశాబ్దాలుగా ఒకే కోరిక - "మా పొలాల్లోనూ సాగర్ నీరు రావాలి" అనే కల. ఈ కలను నెరవేర్చడానికి మరోసారి రైతు బాంధవుడు మల్లు భట్టి విక్రమార్క ముందడుగు వేశారు. 2009-10లో జాలిముడి వద్ద సుమారు ?100 కోట్లతో ఆనకట్ట నిర్మించి మధిర-బోనకల్ మండలాల రైతులకు సాగు, త్రాగునీటి సౌకర్యం కల్పించిన భట్టి విక్రమార్క, ఇప్పుడు వంగవీడు వద్ద వైరా నదిపై 630 కోట్ల అంచనాతో 'జవహర్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్' ఏర్పాటు చేయడానికి శ్రీకారం చుడుతున్నారు. ఈ స్కీమ్ భూమిపూజ ఆదివారం (ఆగస్టు 10) నాడు జరుగనుంది.

ఖమ్మం, మహా

### హామీ నుంచి హరిత భవిష్యత్తు వరకు

2009లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన భట్టి విక్రమార్క, వైయస్ రాజశేఖర్ రెడ్డి, రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి కేబినెట్లలో కీలక పదవులు చేపట్టి, రెండో జోన్ కింద సాగర్ నీటిని మధిర–ఎర్రుపాలెం మండలాలకు మళ్లించే సర్వే, ప్రతిపాదనలు చేయించారు. అయితే, ఉమ్మడి రాష్ట్రంలో ఆ ప్రతిపాదనలు అమలు కాకుండా పోయాయి. ఇప్పుడు, కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడంతో, ఉప ముఖ్యమంత్రిగా ఉన్న భట్టి విక్రమార్క తన పాత హామీని నిలబెట్టి, రైతులకు నీటి హామీని వాస్తవం చేస్తున్నారు.

## ప్రాజెక్టు రూపకల్పన - సాంకేతిక విశేషాలు

పాలేరు రిజర్వాయర్ నుండి వైరా రిజర్వాయర్‌కు సాగర్ జలాలు, అలాగే సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు అందుతాయి.

వంగవీడు వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా మూడు పంపు షెడ్లు ఏర్పాటు చేసి కాలువలను సాగర్ కాలువలకు అనుసంధానం చేస్తారు.

250 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకొని ప్రాజెక్టు మౌలిక వసతులు ఏర్పాటు చేయనున్నారు.

ఎర్రుపాలెం మండల చివరి భూములకు ఏడాది పొడవునా సాగునీరు అందేలా రూపకల్పన.

మధ్యలోని చెరువులు నింపి, పర్యాటకంగా అభివృద్ధి చేసే ప్రణాళిక.

## రైతుల కృతజ్ఞత

మధిర నియోజకవర్గ రైతులు భట్టి విక్రమార్కను "భవిష్యత్ దృష్టితో ఆలోచించే నాయకుడు, ప్రజల కోసం అహర్నిశలు కృషి చేసే యోధుడు"గా కొనియాడుతున్నారు. జాలిముడి ఆనకట్టతో భూగర్భ జలాలు పెంచి రైతుల ఆర్థిక పరిస్థితిని మార్చిన ఆయన, ఇప్పుడు వంగవీటి లిఫ్ట్ ఇరిగేషన్‌తో మరింత సస్యశ్యామలం చేయబోతున్నారు.

## భూమిపూజలో రాజకీయ శోభ

ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వాకిటి శ్రీహరి, భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆర్ బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే మధిర-ఎర్రుపాలెం మండలాల రైతుల జీవితాల్లో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. రైతుల కలల గంగను భట్టి విక్రమార్క మళ్లీ ఒకసారి వారింటి వద్దకు తీసుకువస్తున్నారు.

# ప్రభుత్వ భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్‌లు

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

## ఇందిరా సౌర గిరిజల వికాసం వేగవంతం చేయాలి




**ఖమ్మం, మహా:** సోలార్ విద్యుత్ ను పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని యావత్ క్యాబినెట్ విధాన నిర్ణయం తీసుకుందని రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయం నుండి ప్రభుత్వ భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు, ఆర్ఓఎఫ్ఆర్ భూముల్లో ఇందిరా సౌర గిరిజన వికాసం పథకం అమలుపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఇట్టి సమీక్ష లో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, ఎస్పిడిసిఎల్ సిఎండి ముషారఫ్ ఫారూఖీ, రెడ్కో సిఎండి అనిలా తదితరులు పాల్గొన్నారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ, అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాలు, పార్కింగ్, క్యాంటీన్ ప్లాన్లు హైదరాబాద్ కు పంపాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్లు అన్నీ కూడా ఒకే నమూనాలో నిర్మించినందున సోలార్ పవర్ ప్లాంట్ లో ఏర్పాటుకు అవసరమైన డిజైన్లు హైదరాబాదు నుంచి పంపిస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. కలెక్టర్ కార్యాలయాల్లో మంచి డిజైన్లు ఉంటే ఆయా కలెక్టర్లు హైదరాబాద్ కు పంపవచ్చని డిప్యూటీ సీఎం సూచించారు. గ్రామపంచాయతీ బిల్డింగ్ మొదలుకొని సెక్రటేరియట్ వరకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సోలార్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటుచేసి పెద్ద ఎత్తున విద్యుత్ ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన వివరాలకు సంబంధించి కలెక్టర్లు హైదరాబాద్ కు పంపాల్సిన వివరాలకు సంబంధించి ఒక ప్రశ్నావళిని పంపిస్తున్నామని, అందులో అన్ని వివరాలు నమోదు చేసి వారం లోపు విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కార్యాలయానికి పంపాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. ప్రభుత్వ భవనాలతో పాటు ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, యూనివర్సిటీ భవనాలపై కూడా సోలార్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటు చేయాలని అందుకు సంబంధించిన భవనాల వివరాలు పంపాలని కలెక్టర్లను ఆదేశించారు. నీటిపారుదల శాఖ, రోడ్లు భవనాల శాఖ పరిధిలో పెద్ద ఎత్తున ఖాళీ స్థలాలు ఉన్నాయని, వాటి వివరాలు సైతం పంపాలని కలెక్టర్లకు డిప్యూటీ సీఎం సూచించారు. సమీక్ష లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, ఖమ్మం కలెక్టరేట్ లో పార్కింగ్ షెడ్ లు సోలార్ ప్యానెల్లతో నిర్మించినట్లు తెలిపారు. ఆదేశాల మేరకు కలెక్టరేట్, ప్రభుత్వ కార్యాలయాలు, ఇర్రిగేషన్ భూములు, దేవాదాయ భూముల వివరాలు సమర్పించనున్నట్లు తెలిపారు. ఈ సమీక్ష లో విద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాసా చారి, ఏడిఇ కమర్షియల్ నాగమల్లేశ్వర రావు, రెడ్కో జిల్లా మేనేజర్ అజయ్ కుమార్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ దినోత్సవాన్ని సంస్కృతి పరిరక్షణ దినోత్సవంగా జరుపుకోవాలి




**జూలూరుపాడు, ఆగస్టు 09, (మహా):** ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఆదివాసీల సంస్కృతి పరిరక్షణ దినోత్సవంగా జరుపుకోవాలని సామాజిక సమరసత తెలంగాణ కన్వీనర్ అప్పాల ప్రసాద్ అన్నారు. శనివారం కొమురం భీమ్ ఫౌండేషన్ ఆద్వర్యంలో మండల కేంద్రంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా ఆదివాసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అప్పాల ప్రసాద్ కొమురం భీమ్ విగ్రహానికి పూలమాలవేసి, ఆదివాసి జెండా ను ఆవిష్కరించడం జరిగింది. అనంతరం ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆదివాసీ సంస్కృతి పరిరక్షణ సభ నిర్వహించి, ఆదివాసి ఆడబిడ్డలతో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పాల ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలలో ఆదివాసులు చేసిన పోరాటాల ఫలితంగా ఆగస్టు 9వ తేదీని ప్రపంచ ఆదివాసి దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి గుర్తించిందని అన్నారు. ఆదివాసి దినోత్సవం అంటే కేవలం ఆదివాసులు జరుపుకునే పండగ కాదని, ఆదివాసుల సంస్కృతి, అడువులు, స్వచ్ఛమైన నీరు, అనుభవిస్తున్న ప్రజలందరూ జరుపుకోవాల్సిన పండగ అని అన్నారు. జల్ జంగల్ జమీన్ ఇది రాజకీయ నినాదం కాదని, ఎక్కడైతే భూమి పచ్చగా, అడవి శాతం ఎక్కువగా ఉండి స్వచ్ఛమైన నీరు ప్రవహిస్తుందో అక్కడ నివసించే ప్రజలు, పశు పక్షాదులు సుభిక్షంగా ఉంటాయని, ప్రపంచానికి చాటి చెప్పిన వారు ఆదివాసి బిడ్డలని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఆదివాసి చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర, రాష్ట్ర, ఐటీడీఏ నుండి ఆదివాసీలకు వచ్చే పథకాల గురించి పూర్తిగా అవగాహన కల్పించాలని అన్నారు. ఆదివాసీల పోడు భూములలో ప్రభుత్వం నీటి సౌకర్యం కల్పించాలని కోరారు. అదే విధంగా ఆదివాసీలు జరుపుకునే జాతర్లకు అయ్యే ఖర్చులతో పాటు, మౌలిక సదుపాయాలు కల్పించాలని అన్నారు. ప్రతి ఆదివాసి గ్రామంలో కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమ అనంతరం వివిధ గ్రామల పెద్దలకు, ఆదివాసి పూజారులకు సన్మానం చేయడం జరిగింది. కార్యక్రమంలో ఆదివాసి నాయకులు తెల్లం నరసింహారావు, యదలపల్లి వీరభద్రం, మాజీ వైస్ ఎంపీపీ కోడెం సీత కుమారి, మాజి వైస్ ఎంపిపి యదలపల్లి కళ శ్రీ, మాజి సర్పంచ్ తాటి రోహిణి, బచ్చల రేణుక, పూనం సూరయ్య, తెల్లం మహేష్, మలకం వీరభద్రం, పూకే వీరభద్రం, బచ్చల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సందర్శించిన పోలీస్ కమిషనర్



**ఖమ్మం, మహా:** ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సందర్శించారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నిర్వహణను పరిశీలించెందుకు ఆకస్మికంగా సందర్శించిన పోలీస్ కమిషనర్ స్టేషన్ రికార్డులను తనిఖీ చేసి, ట్రాఫిక్ నిర్వహణలో ఉన్న సవాళ్లను మరియు అవకాశాలను గురించి చర్చించారు. ముఖ్యంగా నగరంలో ట్రాఫిక్ నిర్వహణను మెరుగుపరచడానికి , ప్రజలకు మెరుగైన సేవలను అందించడానికి కృషి చేయాలని, ఎంఫోర్సమెంట్ పై దృష్టి పెట్టాలని అదేశించారు. సిసిటివి కెమెరాల విస్తరణ, ట్రాఫిక్ సమస్య, సంఘటన సమయంలో ప్రతిస్పందన, జరిమానాల వసూలు, ట్రాఫిక్ పరికరాలపై సమీక్ష జరిపారు. అదేవిదంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా వ్యక్తిగత సంస్థలు మరియు మునిసిపల్ కార్పొరేషన్ అధికారుల సమన్వయంతో సరైన పార్కింగ్ స్థలాలను గుర్తించాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో స్వాధీనం చేసుకున్న వాహనాల పార్కింగ్ మరియు నిర్వహణను పరిశీలించారు. ఇది కాకుండా, ఇతర ట్రాఫిక్ నిర్వహణ పద్ధతులపై చర్చించారు.

## డ్రగ్స్-గంజాయి నిర్మూలనకై ఆగస్టు 11న పివైఎల్ బైక్ ర్యాలీలు



**ఖమ్మం సిటీ, మహా:** యువత జీవితాలను నాశనం చేస్తున్న డ్రగ్స్, గంజాయి, మద్యం వంటి మత్తు పదార్థాల నిర్మూలన కోసం ప్రగతిశీల యువజన సంఘం (పి వై ఎల్) రాష్ట్రవ్యాప్తంగా బైక్ ర్యాలీలు నిర్వహించనుంది. ఈ ర్యాలీలు ఆగస్టు 11న అన్ని జిల్లాల్లో జరుగుతాయని పి వై ఎల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వి. రాకేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగావకాశాల లోపం, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల యువత చెడు వ్యసనాలకు బానిసవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్ మత్తులో పడినవారు నేరాలకు పాల్పడుతున్న పరిస్థితి ఆందోళనకరమని పేర్కొన్నారు. మత్తు పదార్థాల నిర్మూలన కోసం యువతలో చైతన్యం కలిగించే లక్ష్యంతో ఈ బైక్ ర్యాలీలు జరుగుతున్నాయని, పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని యువతను పిలుపునిచ్చారు.

## ఖమ్మం నియోజకవర్గంలో 200 మందికి చెక్కుల పంపిణీ



**ఖమ్మం సిటీ, మహా:** వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు సిఫారసుతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను నేడు ఖమ్మం నగరంలోని అన్ని డివిజన్లు, రఘునాథపాలెం మండలం లోని పంచాయతీలకు చెందిన లబ్ధిదారులకు అందజేశారు. మొత్తం 200 మందికి, సుమారు ?85 లక్షల విలువ గల చెక్కులను డాక్టర్ తుమ్మల యుగంధర్ కార్పొరేటర్లు, టౌన్ మరియు మండల నాయకుల ద్వారా పంపిణీ చేశారు. చెక్కులు అందుకున్న వెంటనే, లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి అందించాలని యుగంధర్ సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, టౌన్ మరియు మండల నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతు బీమాకు 2.09 లక్షల మంది అర్హులు

**ఖమ్మం, మహా:** రైతు బీమా పథకం 2025 సంవత్సరానికి ఖమ్మం జిల్లాలో మొత్తం 2,09,387 మంది రైతులు అర్హులుగా గుర్తించబడ్డారని జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య తెలిపారు. 8వ పాలసీ సంవత్సరం కోసం ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఈ అర్హతలు ఖరారయ్యాయి. శనివారం అధికారిక ప్రకటన విడుదల చేస్తూ ఆయన వివరాలు వెల్లడించారు. రైతు బీమా పథకంలో పేరు నమోదు చేసుకోవాలనుకునే వారు తప్పనిసరిగా నూతన పట్టాదారు పాస్‌బుక్ లేదా అటవీ హక్కుల గుర్తింపు పత్రం కలిగి ఉండాలి.

# సోదర భావంతో మంత్రులకు రాఖీలు





**ఖమ్మం, మహా:** రాఖీ పౌర్ణమి సందర్భంగా జిల్లాలో పండుగ వాతావరణంలో మునిగిపోయాయి. అన్నా-చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా పలువురు ప్రజా ప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు తమ ఆప్యాయతను మంత్రులకు రాఖీలు కట్టి వ్యక్తం చేశారు. సత్తుపల్లి పర్యటనలో ఉన్న రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డికి స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి సోదర భావంతో రాఖీ కట్టి శుభాకాంక్షలు అందించారు. “మీరు ప్రజల అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తున్నారు మా ప్రాంతానికి మరింత అభివృద్ధి చేకూరాలని కోరుకుంటున్నాను” అని రాగమయి తెలిపారు. దీనికి మంత్రి స్పందిస్తూ, “రాఖీ అనేది కేవలం దారమే కాదు హృదయాలను కట్టే బంధం” అని పేర్కొన్నారు. ఖమ్మం క్యాంపు కార్యాలయంలో కూడా రాఖీ పండుగ సందడి కొనసాగింది. పలువురు మహిళలు, గృహిణులు, కార్యకర్తలు మంత్రికి రాఖీలు కట్టి ఆశీస్సులు అందుకున్నారు. మాజీ జెడ్పీటీసీ బొర్రా ఉమాదేవి సోదర భావంతో రాఖీ కట్టి, మంత్రివర్యుల అభివృద్ధి కార్యక్రమాలను ప్రశంసించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్ హాజరయ్యారు. ఇక సంజీవ్ రెడ్డి భవన్‌లో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో కూడా రాఖీ పౌర్ణమి వేడుకలు జరిగాయి. జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణలకు జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, నాయకురాలు ఊరుకొండ చంద్రిక రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు బ్రహ్మకుమారీస్ సభ్యులు రాఖీ కట్టి శుభాకాంక్షలు అందించారు. ఆడబిడ్డల రక్షణ, శ్రేయస్సు కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తానని తుమ్మల హామీ ఇచ్చారు. రాఖీ పండుగ అనుబంధానికి, రక్షణకు ప్రతీక అని ఆయన పేర్కొన్నారు.



## వికలాంగుల హక్కులపై మంద కృష్ణమాదిగ గర్జన

**సత్తుపల్లి, మహా:** వికలాంగులు, వృద్ధులు, చేనేత, గీత, బీడీ కార్మికులు, ఒంటరి మహిళల పెన్షన్ల పెంపుపై ప్రభుత్వాన్ని వెంటనే చర్యలు తీసుకోవాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత, వికలాంగుల ఆత్మబంధువు మంద కృష్ణమాదిగ డిమాండ్ చేశారు. శనివారం సత్తుపల్లి టౌన్‌లో జరిగిన విహెచ్‌పీఎస్ మహాగర్జన సన్నాహక సదస్సులో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, వికలాంగుల పెన్షన్‌ను ?6,000కు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత, గీత, బీడీ కార్మికుల పెన్షన్‌ను ?4,000కు, కండరాల క్షీణతతో బాధపడుతున్న వారికి ?15,000కు పెంచాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయంలో నిర్లక్ష్యం వహించరాదని హెచ్చరించిన మంద కృష్ణమాదిగ, “ఆగస్టు చివరి నాటికి పెన్షన్లు పెంచకపోతే తాడోపేడో తేల్చుకుంటాం” అని స్పష్టం చేశారు.

## సత్తుపల్లిలో ఆదివాసుల దినోత్సవం వేడుకలు



**సత్తుపల్లి, మహా:** ఆదివాసుల దినోత్సవం సందర్భంగా సత్తుపల్లిలోని కొమరం భీమ్ విగ్రహానికి ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్లు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, “ఇందిరమ్మ ప్రభుత్వం ఆదివాసులకు అండగా నిలుస్తోంది. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో వారికి ప్రత్యేక ప్రాధాన్యం కల్పించాం. సత్తుపల్లి నియోజకవర్గ విజయంలో ఆదివాసీల పాత్ర ఎంతో ముఖ్యమైనది. వారు పెట్టుకున్న నమ్మకానికి తగిన విధంగా, అవసరమైన అన్ని సౌకర్యాలు అందించేందుకు కృషి చేస్తాం” అని తెలిపారు.

## స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో రాఖీ సంబురాలు




**ఖమ్మం సిటీ, మహా:** స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో రక్షాబంధన్ సంబురాలు శనివారం ఆనందోత్సవాలతో నిర్వహించారు. పాఠశాల విద్యార్థులలో బాలికలు తమ తరగతి బాలుర ముంజేతికి రాఖీ కట్టి, మిఠాయిలు తినిపించి తమ ఆత్మీయతను చాటుకున్నారు. సోదర ప్రేమకు ప్రతీకగా నిలిచిన రాఖీ పౌర్ణమి వేడుకలను పాఠశాలలో ప్రతి తరగతిలో హుషారుగా నిర్వహించారు. విద్యార్థుల్లో సోదర భావాన్ని పెంపొందించడానికి నిర్వహించిన ఈ వేడుకలు విద్యార్థులలో నూతన ఉత్తేజాన్ని నింపాయి.

## జిజ్జవరపు ప్రతాప్‌కు మంత్రి పొంగులేటి పరామర్శ

**దమ్మపేట ,ఆగస్టు 9 మహా :** మండల పరిదిలోని మల్లారం కాలనీ కి చెందిన జిజ్జవరపు ప్రతాప్ ను రాష్ట్ర రెవిన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం పరామర్శించారు. దమ్మపేట కు చెందిన సీనియర్ పాత్రికేయులు గంగాధర్ శ్రీనివాస్ మేనల్లుడైన ప్రతాప్ హైదరాబాద్ హెటిరో ఫార్మాలో ఉద్యోగం చేస్తూ ,డ్యూటీ ముగించుకొని తన రూమ్ కు వెళ్ళే క్రమంలో వేరొక ద్విచక్ర వాహనం షడన్ బ్రేక్ వేయడంతో అదుపు తప్పి సిటి బస్ క్రింద పడ్డాడు. దీంతో వెన్నెముక ,కాలర్ బోన్ ,రిబ్స్ ,విరిగాయి. 45రోజులు హైదరాబాద్ సింధూ వైద్యశాల లో చికిత్స పొందాడు. చేతులు పూర్తిగా పని చేయడంలేదు . విషయం తెలుసుకున్న మంత్రి పరామర్శించి తాను అండగా ఉంటానని భరోసా కల్పించారు. మంత్రి శ్రీనివాసరెడ్డి కి ప్రతాప్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు చామర్తి గోపిశాస్రి, పగడాల రాంబాబు ,చిన్నశెట్టి యుగంధర్ ,యరగొర్ల రాధాకృష్ణ ,రావు గంగాధర రావు తదితరులు ఉన్నారు.



## కొత్తగా పాస్ బుక్ పొందిన రైతులు రైతు బీమా కొరకు దరఖాస్తు చేసుకోవాలి : ఏఓ



**కూసుమంచి, మహా:** జూన్ 5, 2025 లోగా కొత్తగా పాస్ బుక్ పొందిన రైతులు రైతు బీమా కొరకు దరఖాస్తులు సమర్పించాలని అగ్రికల్చర్ ఏఓ రామడుగు వాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 14 ఆగస్టు1966 నుండి 14 ఆగస్టు2007 మధ్య జన్మించిన రైతులు (18 నుండి 59 సంవత్సరాల మధ్య వయస్సు గల రైతులు) రైతు బీమాకు గతంలో దరఖాస్తు చేసుకోని వారు వెంటనే సంబంధిత ఏఈఓ లను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుల సమర్పించడానికి ఆఖరి తేదీ ఆగస్టు 13,2025 దరఖాస్తు ఫారం తో పాటు భూమి పాస్ బుక్ జిరాక్స్, రైతు ఆధార్ కార్డు, నామిని యొక్క ఆధార్ కార్డును జత పరిచి రైతు స్వయంగా సమర్పించాలన్నారు. గతంలో దరఖాస్తు చేసుకున్న రైతులు వారి వివరాలను సరిచూసుకొని, ఏవేని మార్పులు చేర్పులు, లేదా నామిని మార్పు మొదలైనవి ఉంటే ఆగస్టు 12, 2025 లోగా ఏఈఓ ను సంప్రదించగలరని తెలిపారు.

# ఆదివాసీలు అందరికి ఆదర్శం

**వారికి ప్రపంచ స్థాయిలో ప్రత్యేక స్థానం** | **ఆదివాసి దినోత్సవ వేడుకలలో ఎమ్మెల్యే, కలెక్టర్**







**మహా భద్రాచలం:** ఆదివాశీల సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచ స్థాయిలో ప్రత్యేక స్థానం కలిగిఉన్నాయని, ఆదివాశీలు అందరికి ఆదర్శం అని భద్రాచలం శాసన సభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు, కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. శనివారం ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలను భద్రాచలం ఐ టీ డి ఏ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివాసి సంప్రదాయ నృత్యాలు, వాయుధ్యాలతో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సెంటర్ లోని మన్యం వీరులు ఘంటం దొర, మల్లు దొర, అల్లూరు సీతారామరాజు విగ్రహాలకు పూల మాలలు వేసి, వారి త్యాగాలను గుర్తుచేసుకున్నారు.అనంతరం జరిగిన ప్రత్యేక సభలో ఎమ్మెల్యే, కలెక్టర్ మాట్లాడుతూ, ఎందరో మహనీయుల త్యాగ ఫలితమే... నేడు ఆదివాసీల సంస్కృతి చిరస్థాయుగా నిలిచి ఉందని అన్నారు. బ్రిటిష్ కాలంలో అటవీ సంపద దోచుకోవడానికి ప్రయత్నించిన వారిని మన మన్యం వీరులు అడ్డుకున్నారని, అందుకే అడవులు సురక్షితంగా ఉన్నాయని అన్నారు. ఆదివాసీలు అటవీ ఫలాలు సేకరించి జీవనోపాధి పొందుతున్నారని అన్నారు. అనంతరం ఐ టీ డి ఏ ప్రాజెక్ట్ అధికారి రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ మాట్లాడుతూ, గిరిజన అభివృద్ధి కొరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నారని, ఐ టీ డి ఏ ల ద్వారా విద్య, ఉపాధి, వ్యవసాయం, గిరిజన గ్రామాలలో మౌళిక వసతులు కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. గిరిజనులకు ఎటువంటి సమస్య ఉన్నా మమ్మల్ని సంప్రదించాలని అన్నారు. భద్రాచలం ఏజెన్సీ కి చెందిన గిరిజన మహిళలు అనేక వస్తువులు, ఆహార పదార్థాలు తయారు చేస్తూ స్వయం ఉపాధి పొందుతున్నారని, ప్రధాన మంత్రి మోడీ భద్రాచలం గిరిజన మహిళలను కొనియాడటం మర్చిపోలేనిదని అన్నారు. గిరిజనుల కోసం ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఐ టీ డి ఏ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు విభాగాలలో రాణిస్తున్న ఆదివాసీలను సత్కరించారు.

# భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్లు

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 09 (మహా):** రాష్ట్రంలో సౌర విద్యుత్ ఉత్పాదకత దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి (ఎనర్జీ) నవీన్ మిట్టల్, రెడ్ కో సి.ఎం.డి., ఎస్.పి.డి.సి.ఎల్. సి.ఎం.డి, సింగరేణి కాలరీస్ సి.ఎం.డి లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో సోలార్ సిస్టం ఇన్స్టాలేషన్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా సౌర విద్యుత్ ఉత్పాదకత దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఇందు కొరకు రాష్ట్రంలోని ప్రభుత్వ భవనాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ రెసిడెన్షియల్




పాఠశాలలు, కళాశాలలు, ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములు, ఆర్. ఓ. ఎఫ్. ఆర్. భూముల వివరాలతో నిర్ణీత నమూనా ప్రకారం నివేదిక రూపొందించి వారం రోజులలోగా సమర్పించాలని తెలిపారు. జిల్లాలలో గల ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల భవనాల రూఫ్ టాప్ పై సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ వహించి అన్ని జిల్లాల కలెక్టర్లు వారంలోగా సంబంధిత వివరాలను ఎనర్జీ డిపార్ట్మెంట్ కు పంపించాలని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాలలోని 6 లక్షల 17వేల ఎకరాలలో సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, ఈ క్రమంలో 3 సంవత్సరాల లోపు ప్రక్రియ పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీ ప్రజలను అన్ని రంగాల్లో ముందుంచడమే లక్ష్యం



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 09 (మహా):** ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో ఆదివాసీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కొత్తగూడెం రైల్వే స్టేషన్ ప్రాంగణం నుండి కొత్తగూడెం క్లబ్ వరకు భారీ ర్యాలీని నిర్వహించారు.కొత్తగూడెం డిఎస్పి రెహమాన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో పోలీస్ అధికారులు ఆదివాసీ నాయకులు ప్రజలు స్థానికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం కొత్తగూడెం క్లబ్లో ఈ ర్యాలీలో పాల్గొన్న ఆదివాసీ నాయకులు ప్రజలతో సమావేశాన్ని ఏర్పాటు చేసారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలోనే ఆదివాసి జిల్లాగా పేరొందిన భద్రాద్రి జిల్లాలో నివసించే ఆదివాసి ప్రజలు అన్ని రంగాల్లో ముందుండేలా చూడడమే జిల్లా పోలీసుల ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా ఎస్పీ తెలిపారు. ఇందులో భాగంగానే ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే ఆదివాసి ప్రజల కోసం ప్రభుత్వం తరపున జిల్లా పోలీస్ శాఖ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని అన్నారు. మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆదివాసి ప్రజలకు విద్య,వైద్యం, రవాణా సౌకర్యాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే యువత కోసం స్పోర్ట్స్ కాంప్లెక్స్ లు ఏర్పాటు చేయడమే కాకుండా వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు శిక్షణ తరగతులను కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పి రెహమాన్,ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ కొత్తగూడెం టూ టౌన్ ఇన్స్పెక్టర్ ప్రతాప్,చుంచుపల్లి సిఐ వెంకటేశ్వర్లు, కొత్తగూడెం వన్టౌన్ సిఐ కరుణాకర్,3టౌన్ సీఐ శివప్రసాద్ మరియు ఇతర పోలీసు అధికారులు సిబ్బంది,ఆదీవాసీ నాయకులు,స్థానికులు పాల్గొన్నారు.

# మెండు రాజమల్లుకు ఘన సన్మానం

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 09 (మహా):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మున్సిపాలిటీ పరిధిలో ఉన్న బూడిద గడ్డ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా మార్కండేయ పూజ నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సంఘం నేతలతో పాటు కొత్తగూడెం స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మెండు రాజమల్లు దంపతులకు తో పాటు పిసికింది శ్రీనివాస్ దంపతులు కూడా హాజరై పూజలో పాల్గొన్నారు, పూజ అనంతరం కొత్తగూడెం స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మెండు రాజమల్లు గారి దంపతులకు ఘనంగా పద్మశాలి సంఘం నేతలు పుష్పమాలలతో శాలువాలతో ఘనంగా సన్మానించారు, ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ,మాజీ కౌన్సిలర్ కనుకు%శీ%ట్ల కుమార్, పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుడిక్యాల సమ్మయ్య , మానవ హక్కుల రాష్ట్ర కార్యదర్శి పల్నాటి ప్రశాంత్, మామిడి కనక రాజయ్య , తుమ్మ నరసయ్య, జాగిరపు మల్లేష్ , రాపల్లి రాజమౌళి,ఇంజపురి రాజేశ్వరరావు, దూడం సుధాకర్,పసుపునూటి ప్రభాకర్, తుమ్మ శ్రీనివాస్,ఇంజపూరి శివ ఎస్. సుజాత, కొత్తగూడెం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఇమంది ఉదయ్. మాటేంటి అశోక్ . ఎల్ ఐ సి కొండయ్య ,గుడ్ల. శ్రీనివాస్. సాహిరి రంజిత్ మరియు తదితరులు పాల్గొన్నారు.



# పూర్తికాని అంతర్గత రహదారులు



**కారేపల్లి, మహా:** మండల కేంద్రమైన కారేపల్లిలో అంతర్గత రహదారులు అసంపూర్తిగా మిగిలిపోవటంతో ఆప్రాంత వాసులకు అవస్థలు తప్పటం లేదు. ఆసంపూర్తి రహదారుల మీద నుండి వాహనాలు వెళ్లితే దానిపై కురకపోతున్నాయి. కారేపల్లి సంత సమీపంలోని గేటుకారేపల్లి రోడ్డు నుండి పాత సోసైటీ కార్యాలయం వరకుపురాతన కాలం నాటి నుండి గ్రామస్తులు అధికంగా వినియోగిస్తుంటారు. ఆ రహదారిని 400 మీటర్లు ఉండగా దానిలో 200 మీటర్లు వరకు అధికారులు సీసీ రోడ్డు వేసి వదిలివేశారు. సింగరేణి ప్రాథమిక పాఠశాల ఎదురుగా సీసీ రోడ్డు కాక పోవటంతో ఆ ప్రాంతంలో బురద మయంగా మారి విద్యార్ధులతో పాటు ఆ రహదారి వెంట వెళ్లే వారికి అవస్థలు తప్పటం లేదు. శనివారం ఆ రహదారిమీదిగా దక్షిణ మధ్య రైల్వే ట్రాక్ దిమ్మెల లారీ వెళ్తూ సోసైటీ కార్యాలయం ఎదుట మట్టిలో కురక పోయింది. బయటకు తీయటం కష్టంగా మారటంతో రైల్వే సిబ్బంది లారీ పై నుండి దిమ్మెలను ప్రత్యేక క్రేన్ ద్వారా క్రిందకు ఆన్ లోడు చేసి లారీని బయటకు తీశారు. కారేపల్లి మోడల్ స్కూల్ వెళ్ళు రహదారి సైతం అసంపూర్తిగా 50 మీటర్ల రోడ్డు ఆగిపోయి అవస్థల పాలు చేస్తుంది. ఇప్పటికైనా ఆధికారులు అసంపూర్తిగా మిగిలిగా సీసీ రహదారులను వెంటనే పూర్తి చేయాలని కోరుతున్నారు.

# పోరాటాలతోనే హక్కులు సాధించాలి

## మాజీ శాసనసభ్యులు గుమ్మడి నరసయ్య





**కారేపల్లి, మహా :** ఆదివాసీలు తమ హక్కుల పరిరక్షణకై పోరాటాలతోనే సాధ్యపడుతుందని, ప్రభుత్వం పేరుకే గిరిజన చట్టాలని అమలులో మాత్రం శూన్యమని మాజీ శాసనసభ్యులు ,ఆదివాసీ నేత గుమ్మడి నరసయ్య అన్నారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవ సందర్భంగా శనివారం మండల కేంద్రమైన కారేపల్లి లో ఆదివాసీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీలు తమ సాంప్రదాయ రీతిలో నృత్యం చేసుకుంటూ, నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కొమరం భీము విగ్రహానికి పూలమాలలు వేయడంతోపాటు తుడుందెబ్బ కార్యాలయం వద్ద ఆదివాసి పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య మాట్లాడుతూ ఆదివాసీలు నేటికీ విద్య, ఉద్యోగ, ఉపాధి, వైద్యావకాశాలుగానీ కనీస మౌలిక సదుపాయాలుగానీ వారికి అందుబాటులోకి రాలేదన్నారు. తమదైన ప్రత్యేక ఆచార వ్యవహారాలను, హక్కులను కోల్పోతున్నారనీ ,తాము పోరాడి సాధించుకున్న హక్కులు క్రమంగా ఒక్కొక్కటిగా కనుమరుగవుతున్నాయనీ ఆవేదన వ్యక్తం చేశారు. అటవీ వనరులు, ఆదివాసీల హక్కుల పరిరక్షణకు సంబంధించిన సమస్యలపై పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. అటవీ, అటవీయేతర భూములను, ఉమ్మడి భూములను ప్రైవేటు కంపెనీలకు ధారాదత్తం చేయడానికి పిసా, అటవీ హక్కుల గుర్తింపు చట్టాలు ఆటంకంగా ఉన్నందున వీటిని నిర్దాక్షిణ్యంగా రద్దుచేయడానికి అటవీ సంరక్షణ నియమాల పేరుతో 2023లో తీసుకొచ్చిన చట్టంతో ఆదివాసీలు ఇప్పటివరకు పోరాడి సాధించుకున్న అన్ని హక్కులూ అణచివేతకు గురవుతున్నాయన్నారు.. మరోవైపు ఆపరేషన్ కగార్ పేరుతో, మావోయిస్టు రహిత భారత్ ను సృష్టిస్తామంటూ మోదీ ప్రభుత్వం ఆదివాసీలపై యుద్ధం ప్రకటించిందనీ, వందలాది మంది ఆదివాసీలను కేసులలోపేరు పెట్టారని, ఇదెక్కడి న్యాయమన్నారు. మనమందరం కొమరం భీం ఆశయ సాధనకు పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుగ్గి కృష్ణ, బచ్చలి వెంకటేశ్వర్లు, ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి వీసాల రాంబాబు, సింగరేణి మండల ప్రధాన కార్యదర్శి యదల్లపల్లి శ్రీనివాస్, ఎంపీటీసీల గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు వజ్జ రామారావు, ఈసం భాస్కర్, ఆదివాసి జిల్లా ప్రధాన కార్యదర్శి వట్టం నాగేశ్వరరావు, హెల్త్ సెంటర్ ఉద్యోగుల సంఘం నాయకురాలు జ్యోతి, రాంప్రసాద్ ,శివరాం ,తాటి రామారావు, తాటి సరోజిని, కురసం సత్యనారాయణ ,బొర్రా స్వామి, పొడుగు పెంటయ్య ,తదితరులు పాల్గొన్నారు.

# చేతబడి చేశాడనే అనుమానంతో యువకుడిని కొట్టి చంపిన గ్రామస్తులు

**టేకులపల్లి - మహా :** మూఢనమ్మకాల నెపంతో గ్రామస్తులు చేసిన హత్యపై టేకులపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ స్టేషన్ సీఐ బత్తుల సత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ చంద్రబాను హాజరై,ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ఆధునిక కాలంలోనూ పలు మారుమూల గిరిజన గ్రామాలలోమూఢనమ్మకాలతో హత్యలు చేస్తూనే ఉన్నారు.మంత్రాలకు చింతకాయలు రాలుతాయా ? ఇది మన పెద్దలు తరచూ వాడే మాట. వెనుకటి కాలం లో కొంతమంది హేతు వాదులు, మంత్రాలు తంత్రాలు మీద నమ్మకం లేని వారి నోటినుండి పుట్టిన మాట కావచ్చు ఇది చెట్టుమీద ఉన్న చింతకాయలు కావాలంటే చెట్టెక్కి కోసుకోవడమో,పెద్ద గడ పెట్టి కోయడమో చేయాలి కానీ ,చెట్టు క్రిందకు వెళ్లి చింతకాయలు ను చూస్తూ మంత్రం పఠిస్తే అవి రాలవు కదా? అని దీనిలోని భావం. ఒక మనిషి మీద అనుమానం వచ్చిందంటే జీవితాంతం



ఉంటుందనే మాటను సార్ధకం చేసారు గ్రామస్తులు తమ గ్రామంలో చేతబడి చేశారనే నెపంతో ఒకరిని చెట్టుకు కట్టేసి చితకబాదారు. అంతేకాదు ఆ చేతబడి ఎందుకు చేశారని ప్రశ్నించిన ఆ వ్యక్తి సమాధనం చెప్పకపోవడంతో నిజాన్ని ఎప్పకోవలని చితకొట్టారు. అసలు విషయం అక్కడ కామెర్లతో యువతి మృతి చెందగా కానీ గ్రామస్తులు చేతబడి చేశాడనే అనుమానంతో యువకుడిని కొట్టి చంపిన గ్రామస్తులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండలంలో ఈనెల 6వ తేదీ 8 గంటలకు దారుణం చోటుచేసుకుంది.గుత్తి కోయ కుటుంబాలు ఉంటున్న బస్తాయి గ్రామంలో మంత్రాల నేపంతో మడకం బీడ (అలియాస్) రాజు (35)ను గ్రామస్తులు కర్రలతో దాడి చేసి కొట్టడంతో మృతి చెందాడు. గ్రామంలో రెండు రోజులు క్రితం ఒక మహిళ మృతి చెందడం రాజు మంత్రాలు చేయడంతోనే మృతి చెందిందనే అనుమానంతో కొందరు గ్రామస్తులు కొట్టి చంపారు. మూఢ నమ్మకాలపై ప్రభుత్వం పలు విజ్ఞాన వేదికలు స్వచ్ఛంద సంస్థలు పోలీసులు ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన గ్రామాల్లో మారుమూల ప్రాంతాల్లో ఇంకా అమానుష ఘటనలు కొనసాగుతూనే ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండలం లో భూసరాయి గ్రామంలో గంగి అనే విద్యార్థిని పదవ తరగతి చదువుతున్నది. ఆమె కామెర్లతో బాధ పడుతూ చికిత్స పొందుతోంది.. రోజులు గడుస్తున్న కామెర్లు ముదిరిపోతున్నాయి తప్ప తగ్గటం లేదు. చికిత్స పొందుతూ రెండు రోజులు క్రితం మృతి చెందింది.. రాజు చేతబడి చేశాడు కనుకే ఆ యువతి ఎంత ఖర్చు పెట్టినా బతకలేదని కొందరు అనుమానించారు. చేతబడి చేశాడనే అనుమానంతో బాలికకు సంబంధించిన ఏడుగురు బంధువులు కలిసి రాజును చితకబాదారు. తీవ్రంగా గాయపరిచారు. దెబ్బలు బాగా తగలడంతో రాజు చనిపోయాడు. మృతదేహాన్ని బుసురాయి గుట్టలలో పడవేశారు. పోలీసులు స్పెషల్ పార్టీ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి అక్కడి నుంచి మృత దేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్ట్ మార్టం కోసం ఇల్లందుకు తరలించారు.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన ఆ యువతి అంతక్రియలు చేసిన ప్రదేశంలోనే రాజుని హతమార్చుడంతో%ొ% గ్రామస్తులతో కలసి పోలీసులు గుట్టల్లో, అడవుల్లో ఆరు కిలోమీటర్ల మేర నడుచుకుంటూ వెళ్లి.. మృతదేహాన్ని డోలికి కట్టి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో అళ్లపల్లి ఎస్సై సోమేశ్వర్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటా రాఖీ పండుగ.. ఊరూరా సందడి..

## అన్నా చెల్లెళ్ళ అనుబంధం రాఖీ పౌర్ణమి

## రద్దీగా మారిన రోడ్లు.. కిటకిటలాడిన దుకాణాలు







**కూసుమంచి, ఆగస్టు 9, మహా:** ఏ ఇళ్ళు చూసిన.. ఏం ఊరు చూసిన సందడే సందడి.. ఆడబిడ్డలు రాకతో పుట్టిళ్ళు పులకించిపోయింది.. స్వీట్లు, పిండివంటలు, పట్టు వస్త్రాలతో ఇళ్ళంతా సందడిగా మారింది. బస్సులు, ఆటోలు ప్రయాణికులతో కిటకిటలాడాయి. రహదారులు రద్దీగా మారాయి. దుకాణాలు మహిళలతో కిటకిటలాడాయి. ఇదంతా రాఖీ పండుగ సందర్భంగా జరిగినవే.

### మహాలక్షిగా భావించి..

ఆడపడుచులను తమ ఇంటి మహాలక్ష్మిగా, పరాశక్తి ప్రతీకకగా భావించే గొప్ప సంస్కృతి మనది. అక్కాచెల్లెళ్లకు అన్ని సమయాల్లో, కష్ట సుఖాల్లో అండగా ఉంటామని భరోసా కల్పించేందకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడకలు జిల్లా వ్యాప్తంగా నిర్వ హించేందుకు అన్నివర్గాల వారు సిద్ధమయ్యారు.

### కిటకిటలాడినా దుకాణాలు

రాఖీ పౌర్ణమి పండుగ సందర్భంగా ఖమ్మం జిల్లాలోని కూసుమంచి మండలంలో రాఖీ దుకాణాల్లో కోలాహలం నెలకొంది. కూసుమంచి మండలంలో రాఖీ పండుగ సందడి కనిపించింది. శనివారం ఉదయం నుంచే రాఖీల అమ్మకాలు జోరందుకున్నాయి. కూసుమంచి మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్లలో టెంట్లు వేసుకుని రాఖీలు విక్రయించగా, మహిళలు కొనుగోలు చేశారు. దీంతో రాఖీ దుకాణాలు మహిళలతో కిటకిటలాడాయి. మహిళలు, చిన్నారులు, యువత వారికి ఇష్టమైన రాఖీలను కొనుగోలు చేశారు. గిఫ్ట్ షాపులు, స్వీట్ షాపులు మహిళలతో రద్దిగా మారాయి.

### మోడ్రన్ రాఖీలకు భలే గిరాకీ..

మారిన కాలానికి అనుగుణంగా కొత్త రకం రాఖీలు మార్కెట్ లోకి రావడంతో యువత, చిన్నారులు ఆ రాఖీలను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు.

### ఆన్లైన్ లో కానుకలు

కాలం మారడంతో పాటు రక్షా బంధన్ తీరు మారింది. విద్య, ఉపాధి, ఇతరాత్ర కారణాలతో దూర ప్రాంతాల్లో ఉంటున్న సోదరులుకు పోస్టు ద్వార రాఖీలను పంపితే, వాటిని కట్టుకు తోబుట్టువులకు కానుకలు పంపే సాంప్రయాదాన్ని పాటిస్తున్నారు. సామాజిక మాధ్యమాల ద్వార పరస్పరం అభినందనలు తెలుపుకుంటూ ఆనందాన్ని పంచుకుంటున్నారు. పద్ధతులు మారినా రాఖీ అనుబంధం, ఆప్యాయత మాత్రం చెక్కు చెదరలేదు.

### చుక్కలనంటిన రాఖీల ధరలు..

రాఖీ పౌర్ణమి సందర్భంగా అక్కా చెల్లెళ్ళు కట్టే రాఖీలు ధరలు మండిపోతున్నాయని మహిళలు చెబుతున్నారు. గతేడాది రూ.5 నుంచి రూ.100 వరకు మంచి రాఖీలు అమ్మే వారిని, కానీ ఈ ఏడాది మంచి రాఖీ కావాలంటే రూ.50కి పైగా ఖర్చు చేయాల్సి వస్తుందని మహిళలు వాపోతున్నారు. అలాగే స్వీట్లు ధరలు కూడా పెరిగినట్లు చెబుతున్నారు.

## గాజాలో మారణహెూమానికి మతం రంగు పులిమే చర్యలు



**ఖమ్మం సిటీ, మహా:** పాలస్తీనాలో ఇజ్రాయిల్ సృష్టిస్తున్న మారణ హెరీమాన్ని వ్యతిరేకిస్తూ... ప్రపంచశాంతిని కోరుతూ ఈనెల 7వ తేదీన ఖమ్మంలో నిర్వహించిన శాంతి ర్యాలీకి అపూర్వ జనాదరణ రావటాన్ని బీజేపీ జీర్ణించుకోలేకపోతోందని అఖిలపక్షాల నేతలు, సీపీఐ(ఎం), సీపీఐ, సీపీఐ (ఎంఎల్) సూస్లైన్ జిల్లా కార్యదర్శులు సున్నా నాగేశ్వరరావు, దండి సురేష్, గోకినేపల్లి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, బీఆర్ఎస్ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు లక్ష్మీనారాయణ అన్నారు. మానవత్వాన్ని మరిచి బీజేపీ జాతీయ నేత పొంగులేటి సుధాకర్రెడ్డి శాంతి ర్యాలీపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. రెండో ప్రపంచయుద్ధం తర్వాత అత్యంత దారుణమైన మారణ హెూమాన్ని గాజాలో ఇజ్రాయిల్ సృష్టిస్తోందన్నారు. ఇప్పటికే 80వేల మందికి పైగా పాలస్తీనియన్లు మరణించినా మానవత్వం లేకుండా బీజేపీ వ్యాఖ్యలు చేస్తుండటాన్ని ఖండించారు. ఖమ్మంలోని సీపీఐ(ఎం) జిల్లా కాద్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అఖిలపక్షాల నేతలు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు ప్రపంచశాంతిని కాంక్షిస్తూ ఖమ్మంలో ర్యాలీ నిర్వహిస్తే బీజేపీ నేత పొంగులేటి సుధాకర్రెడ్డి ఓట్ల కోసం ప్రచారమంటూ చౌకబారు వ్యాఖ్యలు చేయటం అర్థరహితమని ఖండించారు.

## నూరేళ్ల ఆయుస్సుతో వర్ధిల్లాలని సోదరులను దీవించిన సోదరీమణులు



**మహా కొణిజర్ల:** భారతదేశ హిందూ సాంప్రదాయ పండుగల్లో భాగంగా అత్యంత నిష్టాప్రీతిగా జరుపుకునే స్నేహ, రక్త బంధువుల పండుగ రాఖీ పౌర్ణమి (రక్షాబంధన్). సోదరులు సోదరీమణుల మధ్య ఉన్న ప్రత్యేకమైన చెదరని నమ్మక బంధానికి ప్రతీకగా చెప్పుకొని జరుపుకోవడం పురాతన కలం నుండి అనవాయితీలో భాగమే. ఇట్టి రాఖీ పండుగను పురస్కరించుకొని శనివారం కొణిజర్ల మండలంలో గ్రామ గ్రామాన ఆడపడుచులు తమ అన్నదమ్ములకు ఘనంగా రాఖీలు కట్టి దేవుని దయతో సుఖసంతోషానందాలతో నూరేళ్ల ఆయుష్షు కలిగి వర్ధిల్లాలని ఆడపడుచులు దీవెనలు అందించారు. ఈ సందర్భంగా ఆడపడుచులు మాట్లాడుతూ మాతోటి రక్తబందువులు, స్నేహితులు ఆయురారోగ్యాలతో కలకాలం సంతోషంగా ఉంటూ, మాపై రక్షణ బాధ్యతగా కలిగి ఉండాలని దీవెనలుకోరి,సుదూర ప్రాంతాల నుండి రావడం ప్రయాసతో కూడుకున్నదైనా తోడబుట్టిన వారి కోసం తమ పుట్టినిల్లుకి రావడం గొప్ప భాగ్యం అని సంతోషాన్ని వ్యక్తి పరిచారు.ఈ సందర్భంగా గ్రామాల్లో ఎక్కడ చూసినా ఆడపడుచులు సంతోషానందాలతో సందడి వాతావరణం సంతరించుకుంది.ఇట్టి రాఖీ వేడుకలను కుల, మత,బేధం లేకుండా ప్రజలందరూ భిన్నత్వంలో ఏకత్వంతో జరుపుకొని భారత దేశ ఖ్యాతిని చాటారు.

## ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని హక్కుల పరిరక్షణక దినంగా జరపండి

**జూలూరుపాడు, ఆగస్టు 09, (మహా):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఆగస్టు 09 న జరిగే ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని నేడు ప్రజాస్వామ్యవాదులు, ఆదివాసులందరూ హక్కుల పరిరక్షణ దినంగా జరుపుకోవాలని బానోత్ ధర్మ, ఎదులాపురం గోపాలరావు అన్నారు. ఒకప్పుడు స్వాతంత్రంగా స్వచ్ఛంగా అడవులను అనుభవిస్తూ జీవించిన ఆదివాసి ప్రజలు ఈరోజు ఆ హక్కులను కాలరాస్తున్న రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల విధానాలను తిప్పి కొట్టాలని కోరారు. ఈ ప్రపంచ దినోత్సవ సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసులను అడవి నుండి దూరం చేసే ప్రయత్నాన్ని మానుకోవాలని హెచ్చరించారు. టైగర్ జోన్ ల పేరుతో ఆదివాసులను అడవి నుండి దూరం చేసి వారి హక్కులను కాలరాసే ప్రభుత్వ జీవోలను తక్షణమే రద్దు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు లింగాల వీరభద్రం, రాయల సిద్దు, పైదా వెంకటేశ్వర్లు, కల్తీ నాగేశ్వరావు, కంగాల వెంకటమ్మ, భూక్య గోపాల్, ఈసం బాబురావు, బి చిరంజీవి, బొల్లం లక్ష్మయ్య, ఆటో వర్కు సీనియర్ నాయకులు నిమ్మటూరి లచ్చయ్య, ఎస్ మధు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు



**నేలకొండపల్లి, ఆగస్టు 9 మహా:** మండలం లోని వివిధ గ్రామాలలో రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జామునుంచే దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని ఆరెగూడెం లో భవిత-పవిత్ర అనే అక్కా చెల్లలు ప్రతీ ఏడాది మాదిరిగానే రాఖీ కట్టుకుంటారు. వారి అనుబంధం ను మరింత బలపరిచే విధంగా రాఖీ పండుగ ను జరుపుకుంటారు. మండలం లోని పలువురు సోషల్ మీడియా వేదికగా రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పండుగ వలన పలు దుకాణాలు సందడిగా కనిపించాయి. మోటాపురంలో సోసైటీ మాజీ డైరెక్టర్ రావెళ్ల కృష్ణారావు నివాసంలో సందడి చేశారు. సోదరి రాఖీ - కట్టటంతో ఆశీర్వాదం తీసుకున్నారు.

## ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం వేడుకలు





**మహా న్యూస్, కొత్తగూడెం:** లక్ష్మిదేవిపల్లి మండలకేంద్రంలో శనివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా మండల ఆదివాసీల ఆద్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆదివాసీల ఆరాధ్య దైవం కొమరం భీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తూ వారి పోరాట స్ఫూర్తి, పోరాట పటిమను కొనియాడారు. కాకతీయులపై శ్రీ సమ్మక్క సారలమ్మల వీరోచిత తిరుగుబాటు, ఆంగ్లేయులపై బిర్సా ముండా ఉద్యమాలను ఆదర్శంగా తీసుకొని ఆదివాసీల హక్కుల సాధనకై ఐక్యపోరాట కార్యాచరణ చేసి సమస్యలు పరిష్కరించుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ఈసారి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మనజిల్లలో అధికారికంగా ఆదివాసీ దినోత్సవం జరిపినందుకు ప్రజాపాలన ప్రభుత్వనికి కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు పోడియం.బాలరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పూణె. శ్రీనివాస్, మాజీ సర్పంచ్ తాటి.పద్మ, నాగమణి, అనిత, శోభారాణి, కుమారి, రాములమ్మ, నాయకులు తెల్లం.వెంకటేశ్వర్లు, రాంబాబు, పెండకట్ల.కృష్ణయ్య, పోలెబోయిన. వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షులు పూణె.నర్సయ్య, చుంచు.జగన్, తాటి. తిరుమల్, తాటి.అశోక్, కుంజ.హైమవతి, ఆదివాసీ ఉద్యోగులు సూరిబాబు, సారయ్య, చింత.రాములు, శ్రీనివాస్, కొమరం భీం యువసేన సభ్యులు పాల్గొన్నారు.

# పల్లె రహదారుల అభివృద్ధిపై దృష్టి

## రహదారుల నిర్మాణంతో గ్రామాలను అనుసంధానిస్తున్నాం

- ప్రతి గ్రామానికి పక్కా రహదారుల నిర్మించేదిశగా ప్రణాళిక
- రవాణా సౌకర్యం మెరుగుపడితేనే గ్రామాలు అభివృద్ధి సాధిస్తాయి
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు
- 2.50కిలోమీటర్ల నన్యాతండా-బేతంపూడి రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



**భద్రాద్రి కొత్తగూడెం/సుజాతనగర్ , ఆగస్ట్ 09 (మహా):** గ్రామీణ ప్రాంతాలకు రవాణాసౌకర్యం మెరుగుపర్చేందుకు ముమ్మరంగా రహదారుల నిర్మాణాలు చేపడుతున్నామని, రహదారుల నిర్మాణం, అభివృద్ధిపై ప్రేత్యేక ద్రుష్టి సారించి అనతికాలంలోనే పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. పంచాయతిరాజ్ రోడ్ల శాఖ రూ. 1. 80కోట్ల నిధులతో మండలంలోని బేతంపూడి నుంచి నల్లవాగు మీదుగా నాన్యతాండా వరకు 2. 50కిలోమీటర్ల బిటి రోడ్డు పనులకు శనివారం కూనంనేని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన శంకుస్థాపన సభలో కూనంనేని మాట్లాడుతూ ప్రతి గ్రామానికి పక్కా రహదారి సౌకర్యం కల్పించి రవాణావ్యవస్థను మెరుగుపర్చడంతోపాటు గ్రామాలు, పట్టణాలను అనుసంధానించేందుకు నిరంతర కృషి జరుగుతోందని, రవాణా సౌకర్యం మెరుగుపడితేనే గ్రామాలు అభివృద్ధి సాధిస్తాయని అన్నారు. పంచాయతి రాజ్ శాఖా నుంచి నియోజకవర్గంలో 8. 50కిలోమీటర్ల రహదారుల నిర్మాణానికి రూ. 15కోట్లు మంజూరయ్యాయని త్వరలో పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. రహదారులతోపాటు ప్రజల కనీస అవసరాలైన విద్యుత్ సౌకర్యం, వైద్యం, డ్రైన్ల, త్రాగునీటి వసతి కల్పించేందుకు చేసిన కృషి ఫలితంగా ఇప్పటివరకు 80శాతం మేర పనులు పూర్తికాగా, కొన్ని గ్రామాల్లో నిర్మాణదశలో ఉన్నాయన్నారు. త్వరలోనే నియోజకవర్గంలో సమస్యలులేని గ్రామాలు ఆవిష్కృతమవుతాయని, మునుపెన్నడూ లేని అభివృద్ధిని సాధించి చూపెడుతున్నామన్నారు. నిర్మాణ పనుల్లో కచ్చితంగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ప్రజల నుంచి ఫిర్యాదులు అందితే ఉపేక్షించేదిలేదని దీనికి అధికారులే బాధ్యత వహించాల్సిఉంటుందని హెచ్చరించారు. శంఖుస్థాపనికు వచ్చిన ఎమ్మెల్యే కూనంనేనిని శాలువా, పూలమాలలతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, సొసైటీ చైర్మన్ హన్మంతరావు, గ్రంథాలయ చైర్మన్ వీరబాబు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భూక్యా దస్రు, మండల కార్యదర్శి కొమారి హన్మంతరావు, జిల్లా సమితి సభ్యులు జక్కుల రాములు, టి.పాపారావు, ధర్మారావు, మూడు గణేష్, కొమారి కృష్ణ, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## అనుబంధాల కలయిక.. అన్నా చెల్లెళ్ల సందడిక

**కారేపల్లి , మహా:** భారతీయ సంస్కృతిలో రాఖీ పండుగకు ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. సోదర సోదరీమణుల మధ్య ప్రేమ నమ్మకానికి మధ్య ప్రత్యేకగా నిలిచే పవిత్రమైన పండుగ రాఖీ.. అక్కాచెల్లెళ్ళు అన్నదమ్ములకు రాఖీ కట్టి ఆనందం దీర్ఘాయుష్మ శ్రేయస్సు లభించాలని ఆ భగవంతుడిని కోరుకుంటారు. రక్షాబంధన్ అంటే రక్షణ బాధ్యత సంరక్షణ బంధం అని అర్ధం. శనివారం కారేపల్లి మండలంలోని మేకల తండా,తో పాటు అన్ని గ్రామాలలో ఉదయం నుండి రాఖీ వేడుకల సందడి మొదలైంది.. అక్క చెల్లెల్లు తమ అన్నదమ్ములకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు.. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బానోతు రామ్మూర్తి నాయక్ కుమారుడు లక్ష్మీ వరప్రసాద్, కు తన సోదరి డాక్టర్ స్నేహ రక్షాబంధన్ కట్టి నాకు నువ్వు నీకు నేను రక్ష అంటూ సోదర సోదరీ మణులు ఆలింగనం చేసుకుంటూ తమ ప్రేమా ఆప్యాయత బంధాలను నెమరు వేసుకున్నారు..



ఈ సందర్భంగా గ్రామాలలో ఉన్న రాఖీలు అమ్ముతున్న సెంటర్ల వద్ద ఉదయం నుండి రాఖీల విక్రయాలు జోరుగా కొనసాగాయి.. గ్రామాలలో ఎక్కడ చూసినా రాఖీ పండుగ సందడి నెలకొంది..